# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 15, జులై 2026


## బెజ్జూర్‌లో అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక పర్యటన

**బెజ్జూర్, జూలై 14, ప్రభాతవార్త:**



బెజ్జూర్ మండలంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో మరియు ఎల్కపల్లి గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని పలు వార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి రోగులకు సేవ చేయాలని సూచించారు. ఆయా పాఠశాలల్లో పర్యటించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. గ్రామాల్లో మురుగునీటి వ్యవస్థ, వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో ఇదివరకు జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

## వేలం లేకుండా తాడిచర్ల-2 సింగరేణికి కేటాయింపు

# శుభపరిణామం




- రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ. 60 వేల కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి
- మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఎస్ఆర్‌పీ 3 గనిలో సింగరేణి భరోసా యాత్ర

**నస్పూర్, జూలై 14, ప్రభాతవార్త**

ఎలాంటి వేలం లేకుండా తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేంద్ర ప్రభుత్వం కేటాయించడం సంస్థ ప్రగతికి ఒక శుభపరిణామమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి భరోసా యాత్రలో భాగంగా మంగళవారం ఆయన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ 3 భూగర్భ గనిని సందర్శించారు. గని ఉపరితలంపై ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి ఉద్యోగులు, కార్మికులతో ముఖాముఖ మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తాడిచర్ల2 కోల్ బ్లాక్ ద్వారా సింగరేణికి సుమారు 45 సంవత్సరాల ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ బ్లాక్‌లో 350 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని, దీని ద్వారా సుమారు 2 వేల మంది రెగ్యులర్ కార్మికులకు, 6 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. త్వరలోనే మణుగూరులోని మరో బొగ్గు బ్లాక్ కూడా సింగరేణికి దక్కే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు ఇవ్వాల్సిన రూ. 60 వేల కోట్ల విద్యుత్ బకాయిలను తక్షణమే చెల్లించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. బకాయిలు రాకపోవడం వల్లనే నేడు సింగరేణి సంస్థ మిగతా 2లో..



## ఆపరేషన్ ముస్కాన్ సమర్థవంతంగా అమలు చేయాలి

■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూలై 14, ప్రభాతవార్త**

జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, బాల కార్మికులు, వీధి బాలలు, ప్రమాదకర పరిస్థితులలో ఉన్న చిన్నారులను గుర్తించి తక్షణమే రక్షించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్లు, దాబాలు, టీ స్టాళ్లు, గ్యారేజీలు, వర్క్‌షాపులు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, మిగతా 2లో..



## కేజీబీవీలలో నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆదేశం
- దస్తురాబాద్, కడెం మండలాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విస్తృత పర్యటన
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ..
- గడువులోగా ఎస్.ఎస్.ఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలని స్పష్టం

**నిర్మల్, జూలై 14, ప్రభాతవార్త**

దస్తురాబాద్, కడెం మండలాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయా మండలాల్లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్.ఎస్.ఆర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా దస్తురాబాద్ కేజీబీవీని సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల మిగతా 2లో..

# ఆపరేషన్ ముస్కాన్ సమర్ధవంతంగా అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణ పనులు, షాపింగ్ సముదాయాలు, వ్యవసాయ క్షేత్రాలు తదితర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి వెంటనే రక్షించాలని అధికారులను ఆదేశించారు. రక్షించిన ప్రతి చిన్నారికి వైద్య పరీక్షలు, కౌన్సిలింగ్, విద్యలో పునఃప్రవేశం, కుటుంబ పునరావాసం / అవసరమైతే బాలల సంరక్షణ సంస్థలలో ఆశ్రయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులు, చిన్నారులను దుర్వినియోగం చేసే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నేరపూరిత చర్యలను అరికట్టాలని పోలీసు శాఖకు సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్-12 లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని, ప్రతి రెస్క్యూ చర్యను పకడ్బందీగా నమోదు చేసి, సంబంధిత శాఖలకు సకాలంలో నివేదికలు సమర్పించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణపై ప్రజలలో చైతన్యం కల్పించాలని, బాలల రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై జరుగుతున్న దోపిడీ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, కార్మిక, విద్యా, వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖల అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

## ప్రోటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

**- తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్**

తాండూర్, ప్రభాతవార్త :



కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏల సమావేశం సందర్భంగా ప్రోటోకాల్ పాటించని వారిపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి చర్యలు తీసుకోవాలని తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ కోరారు. తాండూర్ ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కొందరు నేతలు గ్రూపు విభేదాలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. తాను దళిత సర్పంచ్ కావడం వలన మండలానికి చెందిన కొందరు నేతలు బిఎల్ఏల సమావేశం వేదిక మీదికి పిలువ లేదని, ఫ్లెక్సీలో ఫోటో ముద్రించే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం సందర్భంగా ప్రోటోకాల్ పాటించకుండా, ప్రజల ఓట్లతో గెలిచిన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను అవమానించడం సరికాదన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ద బోయిన శంకర్ పార్టీకి చెందిన కొందరు సర్పంచులకు, నాయకులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే సకాలంలో స్పందించి మండలంలో గ్రూపు రాజకీయాలను అరికట్టాలని సూచించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాత నాగరాజు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు సభ్యులు పట్టేం విష్ణు కళ్యాణ్, సహకార సంఘం డైరెక్టర్లు మసాడి తిరుపతి, సర్పంచులు సార్ల తిరుపతి, చందనాల రవికుమార్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఓలకు ఎన్యూరేటర్ ఫారాలు అందజేయాలి

**- దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి**

**- గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఓటర్లకు సహాయక కేంద్రాల ఏర్పాటు**

భైంసా, జులై 14, ప్రభాతవార్త:



ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు, దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి కోరారు. మంగళవారం దేగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను ఆమె పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బోగస్ ఓట్లను అరికట్టేందుకు ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు సహకరిస్తున్నట్లు తెలిపారు. పార్టీ తరఫున నియమితులైన బీఎల్ఏలు ఓటర్లకు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. అర్హులైన వారంతా నిర్ణీత గడువులోగా ఎన్యూరేటర్ ఫారాలను పూర్తి చేసి బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ కరెండే నవీన్, కారాబారి సత్యం, అంగన్‌వాడీ కార్యకర్త నర్సవ్వ, పంచాపుల రజిత, సీఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**- 19 మందికి ఉచిత కేటరాక్ట్ శస్త్రచికిత్సలు**

కాగజ్‌నగర్ రూరల్, జులై 14, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం నిర్వహించిన శిబిరానికి మొత్తం 34 మంది హాజరుకాగా, వారిలో 19 మందికి కేటరాక్ట్ (కంటి శుక్లాలు) ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఎంపికైన ఈ 19 మందికి సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత రవాణా, భోజన సదుపాయాలు కల్పించి, బెల్లంపల్లిలోని లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రికి తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత మాట్లాడుతూ, కంటి సమస్యలతో బాధపడుతున్న నిరుపేద ప్రజలు ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈ శిబిరాల ద్వారా శస్త్రచికిత్స చేయించుకుని చూపు మెరుగుపడిన లబ్ధిదారులు తమ అనుభవాలను ఇతరులతో పంచుకుని మరింత మందిని ఈ సేవల వినియోగానికి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరంలో ఆప్తమాలజిస్ట్ డా. శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇంచార్జ్ గోపి, కిమ్స్ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విత్తన బంతులు వెదజల్లిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కాగజ్‌నగర్ రూరల్, జూలై 14, ప్రభాతవార్త :

పర్యావరణ పరిరక్షణ, అటవీకరణకు ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇకో క్లబ్, వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విత్తన బంతుల (సీడ్ బాల్స్) వ్యాప్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ పచ్చని పర్యావరణ పరిరక్షణలో అధ్యాపకులు, విద్యార్థులు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడంతో పాటు ప్రకృతి సంరక్షణ పట్ల బాధ్యతను పెంచుతాయని పేర్కొన్నారు. ఇకో క్లబ్ కోఆర్డినేటర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. దేవేందర్ రెడ్డి వీరమల్ల మాట్లాడుతూ, క్షీణించిన భూభాగాలను పునరుద్ధరించడానికి, పచ్చదనాన్ని పెంచడానికి సీడ్ బాల్ సాంకేతికత సమర్థవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన విధానమని వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజడ్‌సీ విద్యార్థులు కళాశాల ప్రాంగణంతో పాటు సమీపంలోని అనువైన బహిరంగ ప్రదేశాల్లో స్థానిక వృక్ష జాతులకు చెందిన వందలాది విత్తన బంతులను వెదజల్లారు. రానున్న వర్షాకాలంలో పచ్చదనం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ పునరుద్ధరణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. డి. లక్ష్మీనర్సింహం, డా. ఇ. శారద, డి. జనార్దన్, రోజ్ మేరీ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.



## వేలం లేకుండా తాడిచర్ల-2 సింగరేణికి కేటాయింపు శుభపరిణామం

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి కూడా బ్యాంకుల చుట్టూ అప్పుల కోసం తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని పోటీపడి ముంచాయని, బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి కారణమయ్యాయని ఆరోపించారు. స్థానికంగా ఖర్చు చేయాల్సిన డీఎమ్ఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులను ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించారని మండిపడ్డారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఏ విషయంలోనూ కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఒడిశాలోని నైనీ బ్లాక్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కేంద్ర మంత్రి విమర్శించారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేక సూచనలతోనే నైనీ కోల్ బ్లాక్ అనుమతులు సులభంగా లభించాయన్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు సదరు ఎమ్‌డీఓ టెండర్లను తమ అనుయాయులకు కట్టబెట్టాలని చూశారని ఆరోపించారు. సింగరేణికి పూర్వవైభవం రావాలని, దోపిడీ కమిషన్ల వ్యవస్థ తొలిగిపోవాలని ఆకాంక్షించారు. కార్మిక సంఘాలు తమ జెండాలు, ఎజెండాలు పక్కనబెట్టి కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం పలువురు కార్మిక సంఘాల నాయకులు కేంద్ర మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ రావు, బీజెల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, గొడం నగేష్, ఎమ్మెల్యేలు పైడి రాకేష్, పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రామారావు పాటిల్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, బీఎమ్ఎస్ నాయకులు మాధవ నాయక్, ఏ. శ్రీనివాస్, నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

## కేజీబీవీలలో నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్య, ప్రస్తుత హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం కడెం కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి పెన్నులను బహుమతులుగా అందజేసి అభినందించారు.

**సమయపాలన పాటించి మెరుగైన వైద్యం అందించాలి..**

దస్తురాబాద్, కడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీలో భాగంగా ఆసుపత్రులలోని పలు విభాగాలను, రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య, అందుతున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ పేద ప్రజలకు అందుబాటులో ఉండాలని, రికార్డులను ఎప్పటికప్పుడు పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు.

**ఎస్.ఎస్.ఆర్ ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి..**

మండల కేంద్రాలలో జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను పరిశీలిస్తూ.. సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా ఆన్‌లైన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలలో డీఈఓ భోజన్న, డీఎంహెచ్ఓ రాజేందర్, తహసీల్దార్లు కనక యాదవ్ రావు, ఖాజా మొయినుద్దీన్, ఎంఈఓలు గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, దస్తురాబాద్ సర్పంచ్ గోపాల్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై సమీక్ష

ఆసిఫాబాద్ టౌన్, జూలై 14, ప్రభాతవార్త



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రీకన్సెప్షన్ అండ్ ప్రీనేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టం-1994 ప్రకారం రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ పునరుద్ధరణపై డిఎంహెచ్ఓ సీతారం సమీక్షా నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ లోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పీసీపీఎన్‌డీటీ చట్టంలోని నిబంధనలను ప్రతి అల్ట్రాసౌండ్, ఇమేజింగ్ కేంద్రం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఆడ శిశువు రక్షణ, లింగ వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ సమావేశంలో అల్ట్రాసౌండ్ సెంటర్లు, ఇమేజింగ్ సెంటర్లు, జెనెటిక్ క్లినిక్‌ల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, పరికరాలు, అర్హత కలిగిన సిబ్బంది, సంబంధిత పత్రాలను చట్ట నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన అనంతరం అర్హత పొందిన సంస్థల రిజిస్ట్రేషన్, పునరుద్ధరణకు సిఫార్సు చేశారు. ఈ సమీక్షలో డిప్యూటీ డిఎంహెచ్ఓ నాగేంద్ర, వైద్యులు, సిబ్బంది రవి, స్రవంతి, వాసుదేవ, మహాలక్ష్మి, శ్యామలాల్, రమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**నస్పూర్, జూలై 14, ప్రభాతవార్త**

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ-సెర్ప్ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ, ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ -సెర్ప్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు కాని మహిళలకు యూనిఫాం చీరలు పంపిణీ చేసినట్లయితే, వారిని గుర్తించి వెంటనే సంబంధిత స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని తెలిపారు. స్త్రీ నిధి బ్యాంక్ లింకేజీ కార్యక్రమానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని, రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి నిరర్థక ఆస్తులు సున్నా స్థాయిలో ఉండేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అన్ని రకాల పొదుపు, రుణ కార్యకలాపాలను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో సెర్ప్ సిబ్బంది భాగస్వాములు కావాలని తెలిపారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల అధికారికీకరణ పథకం క్రింద ప్రతి కమ్యూనిటీ కోఆర్డినేటర్ కనీసం ఇద్దరు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, యూనిట్ల స్థాపనకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ-సెర్ప్ అధికారులు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

## బిఎల్ఏలు బాధ్యతగా వ్యవహరించాలి

**- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**తాండూర్, జులై 14, ప్రభాతవార్త :**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) నమోదులో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లు బాధ్యతగా వ్యవహరించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు. తాండూర్ గ్రామపంచాయతీలోని బీసీ కమిటీ హాల్‌లో మంగళవారం బిఎల్ఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాల్లో బీఎల్ఏలు బిఎల్ఓలకు సహకరించాలని సూచించారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యంలో విలువైనదని, ప్రజల ఓటు హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మంచిర్యాల డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో ఏలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్ఏలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్దబోయిన శంకర్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రత్నం సుకుమారి జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**తాండూర్, జూలై 14 ప్రభాతవార్త**

మండలంలోని కిష్టంపేట గ్రామ శివారులో గోవిందుల శ్రీనివాస్ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు తాండూర్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. లబ్ధిదారుల నుండి శ్రీనివాస్ రేషన్ బియ్యాని కొనుగోలు చేసి ఒక ఇంట్లో నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం వచ్చిందన్నారు. వెంటనే అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా రేషన్ బియ్యం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని శ్రీనివాస్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రేషన్ బియ్యం అమ్మిన, కొనుగోలు చేసిన చట్టరీత్యా నేరమని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సాయి స్వస్థ్య వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం

**కాగజ్‌నగర్ రూరల్,జూలై 14, ప్రభాతవార్త**

సద్గురు శ్రీ మధుసూదన్ సాయి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయి స్వస్థ్య వెల్‌నెస్ సెంటర్ ద్వారా మంగళవారం ఆర్ఆర్వో కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, ఉచిత మందులు అందజేశారు. దంత వైద్య నిపుణులు డా. భానుప్రసాద్ (బిడిఎస్) విద్యార్థుల దంతాలను పరీక్షించి, దంత సంరక్షణ, నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి పళ్లను శుభ్రం చేసుకోవడం, తీపి పదార్థాలు అధికంగా తీసుకోకుండా ఉండడం, క్రమం తప్పకుండా దంత పరీక్షలు చేయించుకోవడం వల్ల దంత సమస్యలను నివారించవచ్చని సూచించారు.ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన విద్యార్థులందరికీ ఉచితంగా టూత్‌పేస్ట్, టూత్‌బ్రష్‌లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బట్టు మల్లేశం, లక్ష్మణ్, శ్రీలత, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టూత్‌పేస్ట్ అందజేసున్న నిర్వాహకులు



సిపిఎం మండల కమిటీ సమావేశం పాల్గొన్న నాయకులు

## ప్రజా సమస్యలపై సిపిఎం తీర్మానం

**తాండూర్, జూలై 14, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో మంగళవారం సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దాగం రాజారం, నాయకులు దుర్గం నాన్నయ్య, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయండి

**- బీఎల్ఓలకు సూచించిన ఎమ్మార్వో మల్లికార్జున్**

**చెన్నూరు, జూలై 14, ప్రభాతవార్త**

ఓటరు సవరణ (సర్) ప్రక్రియను వేగవంతం చేయాలని చెన్నూరు ఎమ్మార్వో మల్లికార్జున్ బీఎల్ఓ లకు సూచించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని పొక్కూరు, నాగపూర్, సోమనపల్లి, ఆస్నాద్, తదితర గ్రామాల్లో ఎమ్మార్వో మల్లికార్జున్ పర్యటించారు. ఓటరు సవరణ (సర్) ప్రక్రియలో డిజిటలైజేషన్ పూర్తి చేసి ఎన్యుమరేశన్ ఫామ్స్ కలెక్షన్ చేయాలని సంబంధిత బీఎల్ఓలకు సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రతి పౌరునికి ఒకే చోట ఓటు ఉండేలా చూసుకోవాలని, రెండు చోట్ల ఓటు కలిగి ఉన్నట్లైతే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ప్రజలకు సూచించారు.

## ఆక్వా పార్కులో నిర్వాసిత స్థానిక మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**హాజీపూర్, జూలై 14, ప్రభాతవార్త**

ఆక్వా పార్కులో నిర్వాసిత స్థానిక మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. మండలంలోని నంనూర్ గ్రామంలో నిర్వాసిత మత్స్యకార గ్రామాల ప్రజలతో బోయిరి రాజకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తెలంగాణ మత్స్యకారులు,మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేల్లెల బాలకృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 2026-27 సంవత్సరం ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో సుమారు 100 కోట్ల రూపాయలతో 85 ఎకరాల స్థలంలో నిర్మాణం అవుతున్న ఆక్వా పార్క్ మత్స్య పరిశ్రమ చేపలు రొయ్యలు కొర్రమీను శుభ్రపరచడం ప్రాసెసింగ్ చేయడం విదేశాలకు విజ్ఞత చేసే పనులు మత్స్యకార యువత, మహిళలకు శిక్షణ సంస్థలు,భవన నిర్మాణం, ఫిష్ కోర్టులు, పర్యాటక రంగం అభివృద్ధి పేరుతో స్థానిక స్వయం సహాయ బృందాలకు అవకాశాలు కల్పించడం చేస్తామన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో గుడిపేట, నంనూరు, రాపల్లి, కర్ణ మామిడి గ్రామాల స్థానిక మత్స్యకారులకు ప్రధాన జీవనాధారం చేపల వృత్తి, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సంయుక్తంగా నిర్మిస్తున్న ఆక్వా పార్కులో ఈ నాలుగు గ్రామాల మత్స్యకారులను భాగస్వామ్యం చేయాలని, యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆక్వా పార్కు నిర్మాణంలో ఇలాంటి అవకతవకులు జరగకుండా పారదర్శకంగా నిర్మించాలని, నాలుగు గ్రామాల నుంచి మత్స్యకారుల 25 మంది కమిటీని భాగస్వామ్యం చేయాలని, మత్స్యకారుల గ్రామాల్లో చేపల మార్కెట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోయిరి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు, మంచర్ల రాజేందర్ జిల్లా అధ్యక్షులు, బోడంకి చందు జిల్లా కార్యదర్శి, జునవరి నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు, గగ్గురి రాజన్న జిల్లా సహాయ కార్యదర్శి, బోయిరి రాజకుమార్ జిల్లా నాయకులు, మత్స్యకారులు జునగారి మల్లేష్, మొగుళ్ళ మహేష్, బొగ్గుల చంద్రశేఖర్, రాకేష్, జునగాని గణేష్, ఉట్నూరి రాజ నర్సు, తదితర మత్స్యకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు**

**హాజీపూర్, జూలై 14, ప్రభాతవార్త**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈసందర్భంగా తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్‌తో కలిసి హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామంలోని 123, 124, 125 నంబరు పోలింగ్ కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ఇంటింటి సర్వే, వివరాల నమోదు, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పనులను వేగవంతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితత్వంతో నమోదు చేయడంతో పాటు ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాములు



## ఫీజు బకాయిల విడుదల కోరుతూ కళాశాలల బంద్

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 14, ప్రభాతవార్త :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాగజ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకాశ్ లోకండె మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అరుణ్, రాకేష్, చైతన్య, ప్రీతం, శుభం, తిరుపతి, అంజన్న, విఘ్నేష్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 14, ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక రిలే దీక్షలు మంగళవారం 56వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో ఎం. శంకర్, అబ్దుల్ నబీ, లింగంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. వారికి బీఆర్ఎస్ నాయకుడు నక్క మనోహర్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికులకు గుర్తింపు సంఘాన్ని ఎన్నుకునే ప్రజాస్వామ్య హక్కును యాజమాన్యం కాలయాపన చేయకుండా వెంటనే ఎన్నికల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం మొండి వైఖరి వీడి గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరలక్ష్మి, తన్నీరు పోచం, ఎం. శోభన్, నవీన్, నాజీర్, నరేందర్, శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్మికులు పాల్గొని దీక్షలకు సంఘీభావం తెలిపారు.



## బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

**ఆసిఫాబాద్, జూలై 14, ప్రభాతవార్త**

డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) కోర్సుల ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆసిఫాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్-236 ప్రిన్సిపాల్ డా. ఎం. కనకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 7 చివరి తేదీయని పేర్కొన్నారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9948648465 నంబర్‌ను సంప్రదించాలని, యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



## బాలల్లో నాయకత్వం.. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు

**- మహిళలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే లక్ష్యం : సర్పంచ్ కోట వేణుగోపాల్**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 14, ప్రభాతవార్త :**

బాలల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు మహిళలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే గ్రామపంచాయతీ లక్ష్యమని బారెగూడ సర్పంచ్ కోట వేణుగోపాల్ అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన బాలల గ్రామ సభ, మహిళా గ్రామ సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలల గ్రామ సభలో చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు, ప్రశ్నించే తత్వం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, సామాజిక స్పృహ, క్రమశిక్షణ వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. రేపటి సమాజ నిర్మాణంలో పిల్లల పాత్ర కీలకమని, విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసంపైనా దృష్టి సారించాలని కోరారు. మహిళా గ్రామ సభలో మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రూ.20 లక్షల వ్యయంతో మహిళల కోసం నిర్మిస్తున్న వీవో భవనం త్వరలో అందుబాటులోకి వస్తుందని, దీనివల్ల మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు హరీష్, ముక్తియార్, రుబీనా, శ్యామల, సౌందర్య, ప్రధానోపాధ్యాయులు రవీందర్, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు లక్ష్మణచందా, మామడ మండలాల్లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పర్యటన

**నిర్మల్, జూలై 14, ప్రభాతవార్త:**



బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం లక్ష్మణచందా, మామడ మండలాల్లో విస్తృతంగా పర్యటించి రాచాపూర్‌లో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించడంతో పాటు, తిర్పెల్లిలో రూ. 20 లక్షల సీసీ రోడ్డుకు, లక్ష్మణచందా మరియు మామడ కేంద్రాలలో రూ. 30 లక్షల చొప్పున అగ్రికల్చర్ గోదాముల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి, అనంతరం రాధాకృష్ణ ఫంక్షన్ హాల్, రైతు వేదికల్లో నిర్వహించే బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాల్లో పాల్గొంటారు.



## ఓటు హక్కు పరిరక్షణకు క్షేత్రస్థాయిలో సాక్ పెల్లి సురేందర్

**- ప్రజాస్వామ్యానికి ఓటే బలం.. జులై 24 లోగా ఫారాలు అందజేయాలని పిలుపు**

**సారంగాపూర్, జులై 14, ప్రభాతవార్త:**

ప్రజాస్వామ్యానికి ఓటే బలమని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సురక్షితంగా ఉండాలనే సంకల్పంతో సారంగాపూర్ మండలం తాంద్ర జీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఆయన తన సొంత గ్రామంలో స్వయంగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ అమూల్యమైనదన్నారు. ఏ ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితా నుండి తొలగిపోకుండా చూడటం మనందరి బాధ్యతని పేర్కొన్నారు. అనంతరం ఆయన స్వయంగా దరఖాస్తు ఫారమ్‌లను నింపి గ్రామ జీపీఓ రాజుకు అందజేశారు. ఈ నెల 24వ తేదీ వరకు గ్రామాల్లో అందుబాటులో ఉండే బీఎల్ఓలకు ప్రజలు తమ ఫారాలను పూర్తి చేసి అందజేయాలని సురేందర్ సూచించారు.

## నేడు భైంసాలో జిల్లా ఎస్పీ ప్రజావాణి

**- ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదుల స్వీకరణ**

**- సమస్యల పరిష్కారానికి ప్రజలు ఉపయోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి**

**భైంసా, జులై 14, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల బుధవారం భైంసా పట్టణంలో పర్యటించనున్నారు. భైంసాలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు ఆమె అందుబాటులో ఉండి ప్రజల నుండి ఫిర్యాదులను స్వయంగా స్వీకరిస్తారు. ఈ ప్రజావాణి కార్యక్రమం ద్వారా భైంసా డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చని పోలీస్ శాఖ తెలిపింది. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బహిర్గతమైన కాంగ్రెస్ నేతల గ్రూపు విభేదాలు

**- ప్రోటోకాల్ పాటించలేదని సర్పంచ్ అనుచరుల ఆందోళన - పార్టీ బిఎల్ఎల సమావేశాన్ని బహిష్కరించిన కొందరు నేతలు**

**తాండూర్, జులై 14, ప్రభాతవార్త :**

తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమైనాయి. తాండూర్ గ్రామ పంచాయతీలోని బీసీ కమ్యూనిటీ హాల్ లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏల సమావేశం నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బిఎల్ఏల సమావేశం ప్రారంభం కాగానే తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ జోక్యం చేసుకొని సమావేశం వేదిక మీదికి తనను ఎందుకు పిలువ లేదని, సమావేశానికి సంబంధించిన ఫ్లెక్సీలో తన ఫోటో పెట్టకుండా తాను దళిత సర్పంచ్ అని, ప్రోటోకాల్ పాటించకుండా అగౌరవ పరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సర్పంచ్ అనుచరులు, కొందరు పార్టీ సీనియర్ కార్యకర్తలు వేదిక వద్దకు వచ్చి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడితో వాగ్వాదానికి దిగారు. మండలంలో గత కొన్ని నెలలుగా కొందరు నాయకులు పార్టీ శ్రేణుల మధ్య విభేదాలు సృష్టిస్తూ పార్టీకి నష్టం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని కార్యకర్తలు మండిపడ్డారు. దీంతో సమావేశం గందరగోళంగా మారింది. ప్రోటోకాల్ పాటించకుండా తమ సర్పంచ్ ను అవమానించారని సర్పంచ్ అనుచరులు, కొందరు నాయకులు, కార్యకర్తలు సమావేశం బహిష్కరించి సమావేశం నిర్వహిస్తున్న కమ్యూనిటీ హాల్ ముందు ఆందోళన నిర్వహించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విభేదాలను ప్రోత్సహిస్తున్న డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకుల మధ్య నెలకొన్న గ్రూప్ విభేదాలు ఒక్కసారి భగ్గుమనడంతో కాంగ్రెస్ పార్టీ అభిమానులు, శ్రేణుల్లో ఫ్లెక్సీ రగడ, ప్రోటోకాల్ వివాదం చర్చనీయాంశంగా మారింది.



ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ షోయెబ్ హుస్సేన్

## వర్షాకాలంలో నీరు సాఫీగా ప్రవహించేలా మున్సిపాలిటీ చర్యలు

**నిర్మల్, జూలై 14, ప్రభాతవార్త:**

మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు న్యూ మొఘల్‌పుర ప్రాంతంలో చాలా కాలంగా పేరుకుపోయిన మురికి కాలువలను శుభ్రం చేసే పనులను మంగళవారం చేపట్టారు. కాలువకు అడ్డంగా పెరిగిన చెట్ల వేర్లు, ముళ్ల పొదలను జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ షోయెబ్ హుస్సేన్ స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పనులను పర్యవేక్షించారు. కాలువలో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను తొలగించి వర్షాకాలంలో మురుగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు. వార్డుల్లోని డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పోశెట్టి, పారిశుధ్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నేడు, రేపు నిర్మల్ జిల్లాలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

**- బాసర ట్రిపుల్ ఐటీ సందర్శన.. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష**

**- అత్యాచారాల కేసుల పురోగతి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై సుదీర్ఘ చర్చ**

**నిర్మల్, జూలై 14, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జూలై 15, 16 తేదీల్లో నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పర్యటనలో భాగంగా జూలై 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్మల్ జిల్లాలోని భాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)ని చైర్మన్ సందర్శించి ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారు. కళాశాలలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలు, విద్యా ప్రమాణాలపై అధికారులతో క్షుణ్ణంగా చర్చిస్తారు. అనంతరం జూలై 16వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్మల్ జిల్లా సమీకృత భవన సముదాయం (ఐడీఓసీ) కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసుల పురోగతి, బాధితులకు అందుతున్న సహాయం, అలాగే వివిధ ప్రభుత్వ శాఖల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ల అమలు తీరుపై సమీక్షిస్తారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల త్వరితగతిన పరిష్కారంపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. సమీక్ష ముగిసిన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన రోడ్డు మార్గాన ఆదిలాబాద్ జిల్లాకు బయలుదేరి వెళతారు. జిల్లాలో జరిగే ఈ సమీక్షా సమావేశాల్లో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పూర్తి నివేదికలతో పాల్గొనాలని ఆదేశించారు.



విద్యార్థి సంఘం నాయకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

## స్కాలర్‌షిప్ బకాయిల విడుదల కోరితే అక్రమ అరెస్టులా?

**ఆసిఫాబాద్, జూలై 14, ప్రభాతవార్త :**

విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.10,500 కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఛలో సచివాలయం కార్యక్రమానికి వెళ్లకుండా పీడీఎస్‌యూ, యువజన సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని పీడీఎస్‌యూ కొమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి మంగళవారం ఖండించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉద్యమాలను అణచివేయడం సరికాదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల నుంచి సర్టిఫికెట్ల కోసం డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని కోరారు.

## ఎన్యుమరేషన్ ఫారాల కంప్యూటరీకరణను పరిశీలించిన ఆర్డీవో

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 14, ప్రభాతవార్త :**

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా కాగజ్‌నగర్ ఆర్డీవో సీహెచ్ కృష్ణయ్య మంగళవారం మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలు నంబర్లు 83, 85లను సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, ఆన్‌లైన్ కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు, సూపర్వైజర్లతో మాట్లాడిన ఆయన, ప్రతి ఎన్యుమరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నాణ్యతతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి ఓటరు వివరాన్ని జాగ్రత్తగా ధృవీకరించి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కంప్యూటరీకరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వానికి ఎన్యుమరేషన్ ఫారాల నమోదు కీలకమని పేర్కొన్న ఆర్డీవో, విధుల్లో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని బీఎల్ఓలు, సూపర్వైజర్లకు సూచించారు. ఆర్డీవో వెంట కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) జోగయ్య, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



## సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొత్తపెల్లి మాధవరావు

**- టీపీసీసీ ఆదేశాల మేరకు నియామకం.. హర్షం వ్యక్తం చేసిన పార్టీ శ్రేణులు**

**సారంగాపూర్, జులై 14, ప్రభాతవార్త**



సారంగాపూర్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా కొత్తపెల్లి మాధవరావు నియమితులయ్యారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేడ్మ బొజ్జు, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సంయుక్తంగా ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేందుకే మాధవరావును ఈ పదవికి ఎంపిక చేసినట్లు పార్టీ అధిష్ఠానం తెలిపింది. మండల అధ్యక్షుడిగా నియమితులైన కొత్తపెల్లి మాధవరావుకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని మాధవరావు పేర్కొన్నారు.

## నాలుగు గ్రామాల్లో వంద శాతం పూర్తి: తహసీల్దార్ కే. శ్యాంసుందర్

**- అత్యుత్తమ సేవలు అందించిన బీఎల్ఓలకు ఘన సత్కారం**

**బజార్‌హత్నూర్, జులై 14, ప్రభాతవార్త:**



భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ బజార్‌హత్నూర్ మండలంలో విజయవంతంగా కొనసాగుతోంది. మండల పరిధిలోని బలన్‌పూర్, భూతాయి కే, చందు నాయక్ తండా, మాన్కాపూర్ గ్రామాల్లో ఈ ప్రక్రియ వంద శాతం పూర్తయిందని తహసీల్దార్ కే. శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలో ఎస్ఎస్ఆర్ ప్రక్రియను వంద శాతం విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన బీఎల్ఓలు భాగ్యరేఖ, అనిల్, పోయాం పుష్పలతలను తహసీల్దార్ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సత్కరించి, స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్, ఆర్ఐ నూర్ సింగ్, మహేందర్, జీపీఓ పోచన్న, జూనియర్ అసిస్టెంట్ స్రవంతి, భూతాయి కే సర్పంచ్ మడావి జైతు తదితరులు పాల్గొన్నారు.